
క్లుప్తంగా

ఎన్నికల హామీలు అమలు చేయాలి



నిజామాబాద్‌అర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిరెడ్డి హరీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లాకేంద్రంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి ప్రశాంత్ కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని అమలు చేయడం లేదన్నారు. కేంద్రం తెచ్చిన ఫసల్ బీమాయోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తిరుపతిరెడ్డి, గంగధర్, సుదర్శన్, రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

లాల్ సింగ్‌కు మారయ్యగౌడ్ అభినందన



నిజామాబాద్‌అర్బన్: తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామావత్ లాల్ సింగ్ ను ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్య గౌడ్ మంగళవారం తన ఛాంబర్ లో ఘనంగా సన్మానించారు. ఇటీవల రమావత్ లాల్‌సింగ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ సాధించారు. దీంతో ఆయన్ను అభినందిస్తూ సత్కారించారు. భవిష్యత్తులో మంచి రాజకీయ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకోవాలని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయం

డిచ్‌పల్లి: గతనెల 11న గుండె పోటుతో మృతిచెందిన డిచ్‌పల్లి మండల సీనియర్ జర్నలిస్ట్ లక్కవత్రి నారాయణ కుటుంబాన్ని పరామర్శించిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం పీసీసీ అధ్యక్షులు పంపించిన రూ. లక్ష నగదును టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ మృతుడి భార్య లక్ష్మీకి అందజేశారు. భవిష్యత్తులో కూడా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, డీసీసీ డెలిగేట్స్ వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యాంసన్, రాజు, నవీన్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్ సిటీ: తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం 2వ రాష్ట్ర మహా సభలను విజయవంతంచేయాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ముబారక్‌నగర్‌లోని బీడీ కార్మికులతో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం సిద్ధిరాములు మాట్లాడుతూ.. అక్టోబర్ 11 తేదీన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభకు మంత్రి సీతక్క పాల్గొననున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు పాత కలెక్టరేట్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఈ మహాసభల్లో 10 లక్షల మంది బీడీ కార్మికులకు సంబంధించిన సమస్యలు లేవనెత్తుతామన్నారు. ఈకార్యక్రమంలో జగదీష్, సాయగౌడ్, సాయిలు, ఖాన్, సాయిరాం, రమేష్, లక్ష్మి, లావణ్య, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,25,400	వెండి(కిలో)	1,60,000
22 క్యారెట్స్	1,15,810		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	16	32	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	50	100	దోసకాయ	30	60
దొండకాయ	50	100	ఆలుగడ్డ	30	60
చిక్కుడుకాయ	100	180	గోబిగడ్డ	25	50
కాకరకాయ	40	80	గోబిపువ్వు	50	100
వంకాయ	40	80	బీట్‌రూట్	40	80
పాలకూర	80	160	కరివేపాకు	40	80
మెంతికూర	100	180	చామగడ్డ	30	60
కొత్తిమీర	80	160	చిక్కుడుకాయ	50	100
పుదీనా	50	100	గోరుచిక్కుడు	70	140
క్యాప్సికం	50	100			

-సుభాష్‌నగర్

ఇందిరమ్మ యాప్ పునరుద్ధరణ

- వారం రోజుల ఆటంకానికి తెర
- కార్పొరేషన్ పరిధిలో యాక్టివేట్
- కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టేవారిలో ఆశలు
- లబ్ధిదారులను ప్రోత్సహించాలని కమిషనర్ సూచన

సాక్షి ఎఫెక్ట్..



కార్పొరేషన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్లపై స్పెషల్ రివ్యూలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్

నిజామాబాద్ సిటీ : ఎన్నికల కోడ్ అమలుతో మున్సిపల్ కార్పొరేషన్‌లో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు అడ్డంకి తొలగింది. గత వారం రోజులుగా నిలిచిపోయిన ఆన్‌లైన్ నమోదును మంగళవారం పునరుద్ధరించారు. మంగళవారం 'ఇందిరమ్మ ఇళ్ల యాప్ బ్లాక్' పేరుతో ప్రచురితమైన కథనానికి అధికారులు వెంటనే స్పందించారు. యాప్‌ను కార్పొరేషన్ పరిధిలో యాక్టివేట్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్ తెలిపారు.

వార్డుల వారీగా వివరాలు అడిగిన కమిషనర్

ఇందిరమ్మ యాప్ పునరుద్ధరణతో మంగళవారం మధ్యాహ్నం బల్దియా కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ ఇంజినీరింగ్ ఏఈలు, డీఈలతో స్పెషల్‌గా సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. 60 వార్డుల వారీగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల వివరాలు, మంజూరైన, పనులు ప్రారంభించిన ఇళ్లు, ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లు, బేస్‌మెంట్‌లెవల్‌తో నిలిపివేసిన ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు.



యాక్టివేట్ అయిన ఇందిరమ్మ ఇళ్ల యాప్

నిర్మాణానికి వందమంది రెడీ..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3,500 ఇందిరమ్మ ఇళ్లకుగాను, 1,734 మందికి ప్రొసీడింగ్‌లు ఇచ్చారు. వీరిలో 928 మంది ముగ్గుపోసి బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తిచేశారు. మిగతా పనులు నత్తనడకన సాగుతున్నాయి. మంచి రోజుల కోసం ఎదురుచూసిన దాదాపు 100 మంది లబ్ధిదారులు ముగ్గుపోసేందుకు సిద్ధమయ్యారు. వీరితో వెంటనే పనులు ప్రారంభింపజేయాలని కమిషనర్ ఆదేశించారు.

ప్రభుత్వ తోడ్పాటు..

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేవారికి ఇసుకను క్వారీల నుంచి ఉచితంగా అందిస్తున్నారు. అందుకోసం వారికి టోకెన్‌లు ఇస్తున్నారు. ఇంటినిర్మాణం చేపట్టడానికి ప్రారంభదశలో ఆర్థికస్తోమత లేని మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా రూ.లక్ష రుణం మంజూరుచేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

శానిటరీ ఎస్‌ఐలకు అదనపు బాధ్యతలు..

పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించే శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు కమిషనర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం నుంచి ఇందిరమ్మ ఇళ్ల ఇంటి నిర్మాణ పనులు సైతం చూడాలని ఆదేశించారు. సర్కిళ్ల వారీగా ఆయా సర్కిళ్లలో అధికారులకు, వార్డు ఆఫీసర్లకు సహకరించాలని సూచించారు.

వార్డు ఆఫీసర్లపై చర్యలు..

నగరంలోని 60 మంది వార్డు ఆఫీసర్ల పనితీరును కమిషనర్ సమీక్షించారు. వ్యక్తిగతంగా పనుల్లో వేగాన్ని పరిశీలించారు. డ్యూటీలు సరిగాచేయకుండా దుమ్మొకొట్టే కొందరికి మెమోలు జారీ చేయనున్నారు. కొందరు ట్రేడ్ లైసెన్సు పనులు చేయకుండా, ఇందిరమ్మ ఇళ్లు పనులు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నవారిని గుర్తించి హెచ్చరించారు. ఇకపై ఉపేక్షించనని మెమోలు, చార్జిమెమోలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

> **క్షేత్రస్థాయిలో డబ్బులు అడిగితే దృష్టికి తీసుకురావాలి**
>
> ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికీ ప్రారంభించనివారు వెంటనే ప్రారంభించాలన్నారు. క్వారీల నుంచి ఇసుక, ఆర్థికపరమైన సహాయం కూడా పొందవచ్చు. క్షేత్రస్థాయిలో వార్డు ఆఫీసర్లు, ఏఈలు, ఇతర అధికారులు సహకరించకున్నా, డబ్బులు అడిగినా వెంటనే నా దృష్టికి తీసుకురావాలి.
>
> – దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

మందుల తయారీకి శరీరమే మూలం



మాట్లాడుతున్న ఈశ్వర్‌లింగ

నిజామాబాద్ నాగారం : మందుల తయారీకి మానవ శరీరంపై పరిశోధనలే మూలమని నేత్ర అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ లింగ అన్నారు. మంగళవారం నగరంలోని పెన్షనర్స్ భవన్ లో జరిగిన శరీర అవయవ దాన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. మృతదేహాన్ని కాల్చడమో, పాతి పెట్టడమో కంటే మెడికల్ కాలేజ్ లకు దానం చేస్తే విద్యనభ్యసించే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఒక్కొక్క డెడ్ బాడీ ఒక ప్రొఫెసర్ తో సమానమన్నారు. వైద్య విద్యార్థులు సులువుగా పాఠాలు నేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం మన దేశంలో కోటి మంది మరణిస్తే కేవలం 27 వేల మంది మాత్రమే నేత్రదానం చేస్తున్నారన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామారావు మాట్లాడుతూ శరీర అవయవదాన కార్యక్రమాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కే రామ్మోహన్ రావు, మల్లారెడ్డి, శిర్ప హనుమాన్లు, నర్సింలు, బాడీ డొనేషన్ ఇచ్చిన పెద్ది వెంకట్ రాములు , సంధ్య, అవయవ దానం చేసిన అంది సాయిలు , అనురాధ, సుధాకర్, నాగేశ్వరరావు, పురుషోత్తం, తదితరులు మాట్లాడారు. సిర్ప లింగయ్య పాడిన పాటలు అలరించాయి.

కుమురం భీంకు నివాళి



కుమురం భీం విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు, తదితరులు

నిజామాబాద్‌అర్బన్: ఆదివాసుల అభ్యున్నతి కోసం కుమురం భీం పోరాటం చేశారని మాజీ జెడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు అన్నారు. మంగళవారం కొమరం భీం వర్ధంతి సందర్భంగా వినాయక్ నగర్ లోని ఆయన విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కొమురం భీం వర్ధంతి, జయంతి, ప్రపంచ ఆదివాసి దినోత్సవం ఈమూడింటికి ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసి నాయక్‌పోడు జిల్లా అధ్యక్షులు గాండ్ల రామచందర్, జిల్లా నాయకులు ధాత్రిక అంజయ్య, చిన్న విఠల్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, చందర్ నాయక్, ఉమాపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



సంతోష్‌నగర్‌లో వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

ఖలీల్ వాడి: నగరంలోని తొమ్మిదోవ డివిజన్ సంతోష్‌నగర్‌లో వాల్మీకి సమాజ్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాల్మీకి సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు బోత్ కిషన్, జింజోట్ కిరణ్‌లు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలు జరుపుతున్నామన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శీతల మాత ఆలయ కమిటీ సభ్యులు, వాల్మీకి సమాజ్ నిర్వాహకులు, యువతీ యువకులు, నగర వాసులు పాల్గొన్నారు.

విభేదాలను విడిచిపెట్టి ఐక్యంగా ఉండాలి

- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

డిచ్‌పల్లి : నాయకులు విభేదాలను పక్కన బెట్టి గ్రూపులు కట్టడం మానుకుని ఐక్యంగా ఉండాలని ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు.త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. మంగళవారం డిచ్‌పల్లిలోని కేఎస్‌ఆర్ గార్డెన్స్‌లో పార్టీ కోర్ కమిటీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, గెలుపుకోసం ఆచరించాల్సి ప్రణాళిక లపై ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్‌లు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులుగా ఎవరికి టికెట్ వచ్చినా అందరూ కలిసికట్టుగా పని చేసి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు పార్టీలు కలిసి లోపాయికారీ ఒప్పందంతో కాంగ్రెస్‌పై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. 17 ఎంపీటీసీ స్థానాల్లో గెలిచి ఎంపీపీ పదవితో పాటు జెడ్పీటీసీ స్థానాన్ని కైవసం చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు మునిపల్లి సాయిరెడ్డి, బాబురావు, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సీహెచ్ నర్సయ్య, సొసైటీ అధ్యక్షులు రాంచందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, గ్యానాజి గంగారెడ్డి, డీసీసీ డెలిగేట్స్ వాసుబాబు, దర్మాగౌడ్, శ్యాంసన్, దేవకరుణ, డా.షాదుల్లా అన్ని గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల'కు డబ్బులు ఇవ్వొద్దు

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

సుభాష్‌నగర్ : నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో పని చేస్తున్న హమాలీలు, గుమస్తాలు, దడువాయిలు, చాటా కార్మికులు ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. దళారులకు డబ్బులు ఇచ్చినట్లు నిరూపితమైతే అలాంటి వారి ఇళ్లను రద్దు చేస్తామని తెలిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి, కార్మికులకు ఇళ్లు ఇచ్చేలా ఒప్పించానని పేర్కొన్నారు.

ఈమేరకు యూనియన్ల అధ్యక్ష, కార్యదర్శుల ద్వారా దరఖాస్తులు స్వీకరించామని తెలిపారు. అధికారుల సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. కార్మికులు ఈ విషయాన్ని గమనించి మార్కెట్ కమిటీకి సహకరించాలని చైర్మన్ గంగారెడ్డి కోరారు.

బీసీ రిజర్వేషన్ అడ్డుకునే వారిని తరిమికొడతాం



పూలాంగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు

నిజామాబాద్ నాగారం : బీసీ రిజర్వేషన్ అడ్డుకునే వారిని తరిమికొడతామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తరుణంలో కొందరు కోర్టులో కేసులు వేయడానికి నిరసిస్తూ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు మంగళవారం పూలాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ కుల సంఘ నాయకులు, సభ్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ద్రోహం చేసే వారిని వదిలే ప్రసక్తి లేదని, బీసీ హక్కులను కాపాడుకుంటామని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లను అడ్డుకునే ప్రతి ఒక్కరికి తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కొయ్యడ శంకర్, బగ్గలి అజయ్, బసవ సాయి, శ్రీలత, ఆర్టీసీ శ్రీనివాస్, వాసం జయ, రుక్మిణి, సదానంద్, బాలన్న, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ వినోద్

జక్రాన్‌పల్లి : సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిచ్‌పల్లి సీఐ వినోద్ పేర్కొన్నారు. మంగళవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలలో డిచ్‌పల్లి సీఐ వినోద్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలలో గోల్డెన్ హవర్ ముఖ్యమైనదన్నారు. సోషల్ మీడియా ఫ్రాడ్, డిజిటల్ మార్కెటింగ్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్ చలామణి మొదలగు మోసాలు జరుగుతున్నాయని వాటిపట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహమాన్,పోలీస్ కానిస్టేబుల్‌లు దేవిక , సైబర్ వారియర్, ప్రశాంత్, నిఖిల్, రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డికి ప్రముఖుల పరామర్శ



నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావులు మంగళవారం రూరల్ క్యాంపు కార్యాలయంలో పరామర్శించారు. అలాగే ఎమ్మెల్యే భూపతి రెడ్డిని ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ పరామర్శించారు. గత నెల 29న భూపతిరెడ్డి తల్లి లక్ష్మి నర్సమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. అనంతరం లక్ష్మినర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. గంగారెడ్డి, మునిపల్లి చిన్న సాయరెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ఉన్నారు.

మానసిక ఒత్తిడికి లోనుకావొద్దు



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ కేశవరావు

డిచ్‌పల్లి: విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావద్దని, శారీరక వ్యాయామం, యోగా ఆచరించడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని ప్రముఖ సైకాలజిస్ట్ టి.కేశవకుమార్ సూచించారు. మంగళవారం నిజామాబాద్ రీజియన్ లయన్ సహారా ఆధ్వర్యంలో లయన్స్ ఇంటర్నేషనల్ వారు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), మెంట్రాజ్‌పల్లి ఉన్నత పాఠశాలల్లో మానసిక ఒత్తిడి.. జయించడం ఎలా' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేశవకుమార్ మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడి వల్ల కోపం, అసహనం, నిరాశ, భయం వంటివి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కొండా అమర్‌నాథ్, జోన్ చైర్మన్ నర్సింహరావు, రీజియన్ చైర్మన్ ఉదయసూర్య భగవాన్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

నిజామాబాద్ రూరల్: ప్రజలు మూఢ నమ్మకాలు వీడాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు ప్రేమ్ లాల్ అన్నారు.మంగళవారం నగరంలోని వినాయక్ నగర్‌లో తెలంగాణ రచయితల వేదిక సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బాణామతి చేతబడుల పేరుతో అమాయక ప్రజలను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాల నిర్మూలన కోసం చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

వైభవంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం- బోనాలు



రాంపూర్‌లో బోనాలు తీసుకెళ్తున్న మాజీ ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, గౌడ కులస్తులు

డిచ్‌పల్లి : మండలంలోని రాంపూర్(డి) గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఐదో వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా గౌడ సంఘం ఆధ్వర్యంలో గౌడ కులస్తులు ఇంటికో బోనం సిద్ధం చేసి డప్పు చప్పుళ్లు, నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి ఎల్లమ్మకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఎల్లమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్‌గౌడ్ తన సతీమణితో కలిసి బోనం ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పుస్తె, మట్టెలు సమర్పించారు. ఈ వేడుకల్లో రాంపూర్ గ్రామంలోని గౌడ కులస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దశగౌడ్, సభ్యులు రమేష్ గౌడ్, రామగౌడ్, నరేష్ గౌడ్, స్వామిగౌడ్, కిషన్ గౌడ్, నవీన్‌గౌడ్, భాస్కర్ గౌడ్, మహేష్ గౌడ్, నడ్పి నర్సాగౌడ్, భోజాగౌడ్‌తో పాటు బీఆర్‌ఎస్ నాయకులు ప్రమోద్, ఒడ్డం నర్సయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

రాకేశ్‌ను కఠినంగా శిక్షించాలి



నిజామాబాద్‌నాగారం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై షూ విసిరిన మతోన్మాది రాకేశ్‌కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం పూలాంగ్ చౌరస్తాలో వారు నిరసన చేపట్టారు. జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గైని గంగారాం మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జామతే ఇస్లామి హింద్ నాయకులు షేక్ హుస్సేన్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు బగ్గలి అజయ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సక్కి విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు సుంకరి విజయ, సిక్కు నాయకులు బీరేందర్ సింగ్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ యాజమానులతో సమావేశం



ఖలీల్ వాడి : నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ షాప్ యాజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించినట్లు టౌన్ సీఐ శ్రీనివాస్ రాజు తెలిపారు. ఈ సమావేశంలో ఫ్లెక్సీ ప్రింటింగ్, అలాగే ప్రింటింగ్ ప్రెస్ యాజమానులకు ఫ్లెక్సీ ముద్రించే సందర్భంలో విద్వేషపూరిత, నిషేధిత అంశాలు లేకుండా ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఎన్నికల కోడ్ నేపథ్యంలో పాటించాల్సిన విషయాలను వివరించారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ ముజాహిద్ ఉన్నారు.

పాలస్తీనా ప్రజలకు అండగా ఉందాం



నిజామాబాద్ సిటీ: గాజాపై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడదామని, పాలస్తీనా ప్రజలకు అండగా ఉందామని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్ భవన్ నుంచి వీక్లీ బజార్ చౌరస్తా వరకు న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆకుల పాపయ్య మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ మారణహోమం కారణంగా 6 వేలకు పైగా గాజా ప్రజలు మృతిచెందారన్నారు. ఈ విధ్వంసాన్ని ఆపడానికి భారత్ ఇజ్రాయిల్ దేశంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ భూమయ్య, నీలం సాయిబాబా, జేపీ గంగాధర్, మోహన్, భారతి, బి నర్సయ్యలు పాల్గొన్నారు.